ప్రజాశక్తి

బుధవారం 10 ఏప్రిల్ 2024 5 శ్రీ సత్యసాయి

అసమ్మతి చల్లారిందా..?

◆ నేతలకు ఏమి హామీ లభించిందో..!

◆ అనంత, గుంతకల్లు నేతలు చంద్రబాబుతో సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టిక్కెట్లు ఖరారుపై టిడిపిలో అసమ్మతి చెలరేగిన విషయం తెలిసిందే. ఇందులో చాలా వరకు సర్దుబాటు చేసినా కొన్నింటిలోనూ కొనసాగుతూ వచ్చాయి. ప్రధానంగా అనంతపురం, గుంతకల్లు నియోజకవర్గాలకు సంబంధించి మాజీ ఎమ్మెల్యేలు ప్రభాకర్ చౌదది, జితేందర్ గౌడ్‌లు అసంతృప్తితోనున్నారు. టిక్కెట్టు ఖరారవలేదన్న విషయం తెలిసిన వెంటనే రెండు నియోజకవర్గాలల్లో టిడిపి కార్యాలయాలపై దాడి చేసి ఫర్నీచర్లు ధ్వంసం చేశారు. అనంతరం కూడా నిరసనల పర్వం కొనసాగుతూ వచ్చింది. ఒకనొక దశలో స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తారేమనన్నంతగా ప్రచారం నడిచింది. అయితే పార్టీని వీడబోమన్న విషయాన్ని మాత్రం ఆ ఇద్దరు నేతలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రభాకర్ చౌదరి, జితేందర్ గౌడ్‌లను పిలిచి మాట్లాడారు. దీంతో వారు కొంత మెత్తబడినట్లు సన్నిహితులు చెబుతున్నారు. అయితే వారికి ఎటువంటి హామీ లభించిందన్నది చర్చ నడుస్తోంది. పార్టీ బాధ్యతలు ఈ నేతలకు అప్పగించినట్టు పార్టీలో చర్చ నడుస్తోంది. ప్రభాకర్ చౌదరికి రాయలసీమ బాధ్యతలు అప్పగించనున్నారని ప్రచారం నడుస్తోంది. జితేందర్ గౌడ్‌కు జిల్లా బాధ్యతలు అప్పగించే సూచనలున్నట్టు తెలుస్తోంది. ఈ హామీతోపాటు ఇంకేమైనా ఇచ్చారా అన్నది తెలియాల్సి ఉంది. నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతంతోపాటు వచ్చే ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని సూచించినట్టు తెలుస్తోంది. ఇద్దరు సీనియర్ నాయకులే కావడంతో వారి నియోజవర్గాల్లో మంచి పట్టున్న నేతలు కూడా. వీరు అభ్యర్థులతో కలిసి పనిచేస్తే పార్టీని సానుకూల పరిస్థితులే ఉండనున్నాయి. ఇదే రకమైన అసంతృప్తి ఉన్న శింగనమల నియోజకవర్గం నేతలతో ఇది వరకే చంద్రబాబు మాట్లాడారు. దీంతో శింగనమలలో వ్యతిరేకంగానున్న ఆలం నరసానాయుడు, కేశవరెడ్డిలు ఇప్పుడు మౌనంగా పనిచేసుకునిపోతున్నారు. దీంతో అసమ్మతి కనిపించడం లేదు. ఇక మడకశిరలో ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. అభ్యర్థి సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామికి మధ్య పడటం లేదు. ఈ నేపథ్యంలో అభ్యర్థిని మార్చాలని పట్టుబడుతున్నారు. ఇవి మినహా తక్కిన అన్ని చోట్లా కొంత వరకు పరిస్థితి మారినట్టుగానే కనిపిస్తున్నాయి. అసంతృప్తి తీవ్రంగా ఉన్న కళ్యాణదుర్గం, కదిరిల్లో ఇప్పటికే అసమ్మతి నేతలు పార్టీని వీడిపోయారు. వారు బయటకు పోవడంతో తక్కిన వారు పార్టీ కోసం పనిచేసే వారు ఉండిపోయారు. అనంతపురం, గుంతకల్లు అదినేత హామీతో సద్దుమణిగినట్టయింది. తక్కిన నియోజకవర్గాల్లో ఎక్కడా పెద్దగా అసంతృప్తులు ఇక కనిపించడం లేదు. ఇక సరిచేయాల్సింది మడకశిర నియోజకవర్గం ఒక్కటే పెండింగులో ఉంది.

జెఎన్‌టియుకు పూర్వవిద్యార్థుల వితరణ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు 1963-68 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సి.చిరంజీవి అతని మిత్రులు జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల శిల్పాగర్ల్స్ హాస్టల్‌కు మంగళవారం నాడు స్టీమ్ కుకింగ్ కోసం నూతన స్టీమ్ బాయిలర్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టీమ్ బాయిలర్‌ను 1963-1968 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అందజేసినట్లు తెలియజేశారు. ఎల్లోరా హాస్టల్లోని స్టీమ్ కుకింగ్ బాయిలర్‌ను మరమ్మతు చేయిస్తామన్నారు. అనంతరం సి.చిరంజీవి విద్యార్థినులతో ముచ్చటించారు.

ఓట్ల వేట..!

◆ నామినేషన్లకు ముందుగానే ముమ్మర ప్రచారాలు

◆ అభ్యర్థులే స్వయంగా కలుస్తూ ఓట్ల అభ్యర్థన

◆ కుటుంబం, బంధుగణం మొత్తం ప్రచారాల్లోనే..!

సార్వత్రిక ఎన్నికల సమరంలో ప్రధానమైన ప్రచారాలు వేడెక్కాయి. అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్నారు. నామినేషన్లు దాఖలు చేయకుండానే ఒక విడత ప్రచారం ముగించేలా ఓ స్థాయిలో ప్రచారాలు చేస్తున్నారు. అభ్యర్థుల కుటుంబం, బంధుగణం మొత్తం ప్రచారాల్లో నిమగ్నం అయ్యారు. గెలుపే లక్ష్యంగా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నం అయ్యారు.



ప్రజాశక్తి-అనంతపురం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ సారి ప్రధాన పార్టీలు ముందుగానే అభ్యర్థులను ప్రకటించేశాయి. ఉమ్మడి జిల్లాలో 14 నియోజకవర్గాలకు సంబంధించి టిడిపి, వైసిపి అభ్యర్థులను ప్రకటించాయి. కాంగ్రెస్ సైతం 11 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. దీంతో అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల్లో ప్రచారాలు చేస్తున్నారు. నామినేషన్లు వేసేందుకు ఇంకా 9 రోజుల సమయం ఉంది. ఆ లోపుగానే ఒక విడత ఓటర్లను కలుసుకుని ఓట్లు అభ్యర్థిస్తున్నారు. నామినేషన్ల తంతు పూర్తవగానే ప్రచార వేడి మరింత వేగం పుంజుకోనుంది. ఓ ఒక్క ఓటరనూ వదలకుండా వారితో మాట్లాడుతున్న ఇళ్లు, పొలం అన్న తేడా లేకుండా ఎక్కడ జనం ఉంటే అక్కడికి నేతలు వాలిపోతున్నారు. తమను గెలిపించి ఆదరించాలంటూ విజ్ఞప్తులు చేస్తున్నారు. పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోతో పాటు, స్థానికంగా నియోజకవర్గం, మండలం, ఆ గ్రామంలో చేసే అభివృద్ధిపై హామీలను గుప్పిస్తున్నారు.

ఓట్ల కోసం వ్యూహాలు

అభ్యర్థులు ఓట్ల కోసం వ్యూహాలు రచిస్తున్నారు. ముందస్తుగా వారు పర్యటించే గ్రామాలు, వార్డుల్లో ముఖ్యనేతలతో సమావేశం అవుతున్నారు. ఆ ప్రాంతంలో నిర్వహించే ప్రచారంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..? ఎవరితో మాట్లాడాలి.? మహిళా ఓటర్లను ఎలా ప్రసన్నం చేసుకోవాలని అన్న దానిపై మాట్లాడుకుంటున్నారు. దానికి అనుగుణంగా ఓ పద్ధతి ప్రకారం ఓట్లు అభ్యర్థిస్తున్నారు. తమ పార్టీ మద్దతుదారుడు అయితే ఈ సారి సహకరించమని, ప్రత్యర్థి పార్టీ ఓటరయితే తాము అధికారంలో ఉండగా మీ కుటుంబానికి ఇంత మేలు చేశామని చెబుతున్నారు. ఇక ప్రతిపక్ష టిడిపి అభ్యర్థులు తాము అధికారంలోకి వస్తే మీకు అండగా ఉంటామని హామీని ఇస్తున్నారు. ముఖ్యంగా సూపర్-6 ద్వారా కలిగే ప్రయోజనాలను ఓటర్లకు వివరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్నారు. వృద్ధుల వద్దకెళ్లినప్పుడు టిడిపి అధికారంలోకి వస్తే రూ.4 వేలు పింఛన్ ఇస్తామని, మహిళల వద్దకు వెళ్లినప్పుడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం తదితర వాగ్దానాల గురించి తెలియజేసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

ఉగాదిపై అభ్యర్థుల ప్రత్యేక దృష్టి

ఎన్నికల సీజన్‌లో ఉగాది పండుగ వచ్చింది. తొలిపండుగగా భావించే ఉగాదికి గ్రామాల్లో గ్రామీణులు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తారు. పండుగ రోజు కావడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన కూలీలు, ఉద్యోగ రిత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు స్వగ్రామానికి వచ్చారు. ఈ నేపథ్యంలో పండుగ మూడు రోజులను తమకు అనుకూలంగా మలుచుకుని ఓటర్లను కలుసుకోవాలని అభ్యర్థులు ప్రణాళికలు తయారు చేసుకున్నారు. ఇప్పటికే ఈ విషయంపై గ్రామస్థాయి నాయకులతో మాట్లాడారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడి పండుగ సందర్భంగా గ్రామానికి వచ్చిన ప్రతి ఒక్కరినీ కలిసి ఓటు అడిగేలా అభ్యర్థులు పావులు కదుపుతున్నారు.

అనుకూల, ప్రతికూల ఓట్లపై లెక్కలు

గ్రామాలు, వార్డుల వారీగా అభ్యర్థులు ఇప్పటి నుంచే అనుకూల, ప్రతికూల ఓటర్లను గుర్తించే పనిలో పడ్డారు. అనుకూల ఓటర్ల కంటే ప్రత్యర్థికి వెళ్లే ఓట్లను తమకు అనుకూలంగా తిప్పుకోవడం కోసం అన్ని విధాలా ప్రయత్నం చేస్తున్నారు. ఒక కుటుంబాన్ని తమ వైపునకు తెచ్చుకంటే ఆ ఇంట్లోని నాలుగు ఓట్లు తమకు వస్తాయన్న భావనతో వారిని బుజ్జగిస్తూ వ్యూహాత్మకంగా మందుకు సాగుతున్నారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు వ్యూహాత్మకంగా మందుకు సాగుతున్నారు.

ప్రజల ఆరోగ్యానికి రక్షణ కవచం హోమియో

హోమియోపతి వైద్యశాల

ప్రజాశక్తి-అనంతపురం

అవసరం వల్ల రోగికి స్వస్థత చేకూరాలే తప్ప మందుల దుష్ప్రభావంతో మరెన్నో కొత్త సమస్యలు రాకూడదు. అలా కొత్త సమస్యలు రాకుండా వ్యాధిని నయం చేసే పురాతన వైద్య విధానమే హోమియో చికిత్స. ప్రపంచవ్యాప్తంగా వైద్యరంగంలో అత్యుత్తమ మేధావి హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫెడరిక్ శామ్యూల్ హనేమూన్ హోమియోపతి వైద్య విధానాన్ని కనుగొన్న శాస్త్రవేత్త. ఆయన జయంతి రోజైనా ఏప్రిల్ 10వ తేదీన ప్రపంచవ్యాప్తంగా హోమియోపతి దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ క్రమంలో జిల్లాలో హోమియో వైద్య విధానానికి లభిస్తున్న ప్రజాధరణ ప్రభుత్వ ప్రోత్సాహం తదితరు అంశాలపై నేటి కథనం.

హోమియోను దేశీయ వైద్యంగా భావిస్తారు. దీర్ఘకాలిక వ్యాధులే కాదు కాలానుగుణంగా జబ్బులను సైతం నేటిగా నాణ్యతగా పనిచేసే వైద్యం ఇది. అల్లోపతి వైద్యంతో నయం కానీజబ్బుల సైతం హోమియోలో స్వస్థత చేకూరిందంటే అతిశయోక్తి కాదేమో. ఏటా సీజనల్‌గా జనాన్ని ముప్పతిప్పలు పెట్టే మెదడువాపు, స్వైన్ ఫ్లూ, డెంగీ, చికెన్ గునియా, చికెన్ ఫాక్స్, కండ్ల కలక, విష జ్వరాలు ఇలా ఎన్నో రకాల రోగాలు సోపకుండా హోమియో మందు ముందస్తు రక్షణ కల్పిస్తుంది. 1998లో జిల్లాను వలికించిన మెదడువాపు మహమ్మారిని అదుపు చేసింది హోమియో వైద్యమే. అప్పట్లో 20047 మంది చిన్నారులకు ఆ జబ్బు సోకింది. అలాంటి సమయంలో పసిపిల్లల ప్రాణాలకు రక్షణ కవచంలా హోమియోపతి నిలిచింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 25 ప్రభుత్వ హోమియో వైద్యశాలలు ఉన్నాయి. ఇందులో 12 రెగ్యులర్ 13

నేడు ప్రపంచ హోమియో దినోత్సవం

జాతీయ ఆరోగ్య మిషన్ సారధ్యంలో నడుస్తున్న ఆసుపత్రులు ఉన్నాయి. అనంతపురం, గుత్తి, తాడపత్రి, పుట్టపర్తి, దావలం, గొల్ల మూతిమడుగు, రాయదుర్గం, బెలుగుప్ప తలుపుల, కళ్ళు మర్రి, బీకే సముద్రం, కుందుర్పి, కొనకొండ్ల, దేవనహళ్లి, కొత్తచెరువు, పెనుకొండ, ఎన్‌పి.కుంట, అమడకూరు, కదిరి, బేతేపల్లి, ఎద్దులపల్లి, కనేకల్, పట్నం, ఆత్మకూరులో హోమియో వైద్యశాలలు ఉన్నాయి.

హానికరం లేని వైద్యం

హోమియోపతి వైద్యం ప్రజల వైద్యం. తాత్కాలిక దీర్ఘకాలిక రోగాలను వంద శాతం నయం చేసే ఔషధ గుణం కలిగిన వైద్యమిది. అన్ని రకాల వ్యాధులకు హోమియోపతిలో మందులు ఉన్నాయి. హోమియో మందులను ఎటువంటి దుష్ప్రభావం లేకుండా ధైర్యంగా వాడొచ్చు. అల్లోపతి మందులు తింటూనే హోమియోపతి మందులు కూడా వాడవచ్చు. ప్రభుత్వం అన్ని రకాలుగా హోమియోపతి వైద్యశాలలో మందులను అందుబాటులో ఉంచింది.

డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు, ప్రభుత్వ హోమియో వైద్యశాల, పాతూరు, అనంతపురం.

ప్రజల జీవితాల్లో ఉగాది వెలుగులు నింపాలి

జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

క్రోధి నామ సంవత్సర ఉగాది జిల్లా ప్రజలకు సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, విజయాలను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. క్రోధి నామ తెలుగు నూతన సంవత్సరం ఉగాది వేడుకలను జిల్లా కలెక్టరేట్లో స్పందన సమావేశ మందిరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా మంగళ వాయిద్యాలు, మేల తాళాలతో దేవాదాయ శాఖ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, ధర్మవరం ఆర్డీవో వెంకట శివ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముందుగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ దంపతులు పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు భమ్మిడిపాటి శ్రీనివాస శర్మ పంచాంగ శ్రవణంలోని సారాంశాన్ని తెలియజేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణతో పాటు వాటిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం షడ్రుచుల సమ్మేళనంతో ప్రారంభమమైన నూతన సంవత్సరంలో భగవంతుడు ప్రజలందరి జీవితాల్లో కొత్త ఆనందోత్సవాలు నింపాలని ఆకాంక్షించారు. అన్నదాతలకు మేలు జరగాలని, దేశం ,రాష్ట్రం, జిల్లా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. జిల్లాను అభివద్ధి పథంలో నిలిపేందుకు ఆయా ప్రభుత్వ శాఖ అధికారులు లక్ష్య సాధనలో భాగంగా సత్ఫలితాలు

ఉగాది వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తున్న జిల్లా సంయుక్త కలెక్టర్ దంపతులు

సాధించే దిశగా కషి చేయాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. డిఆర్ఒ కొండయ్య మాట్లాడుతూ తీపి, చేదు, వగరు, పులుపు, కారం, ఉప్పు వంటి ఆరు రుచుల ఉగాది పచ్చడితో ఈ ఏడాది ప్రజలందరికీ సంపూర్ణ ఆయురారోగ్యాలను భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటూ ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా రాష్ట్ర దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఎంపికైన జిల్లాలోని పలు ఆలయ అర్చకులు, వేద పండితులకు ప్రశంసాపత్రంను అందజేసి దుశ్శాలువతో జాయింట్ కలెక్టర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమల శాఖ జెడి పద్మమ్మ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, సిపిఒ విజయకుమార్ ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి రమేష్, స్కిల్ డెవలప్మెంట్ అధికారి అబ్దుల్ ఖయ్యూం, కలెక్టరేట్ ఏవో రామాంజనేయరెడ్డి, తహశీల్దార్ వేణుగోపాల్, జిల్లా దేవాదాయ శాఖ అధికారి నరసింహ, పర్యాటకశాఖ ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

పేదల పెన్నిధి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్

బత్తలపల్లిలో ఘాట్ వద్ద కుటుంబ సభ్యుల నివాళి

బత్తలపల్లిలోని పాదర్ ఫెర్రర్ మాట్ వద్ద నివాళులర్పిస్తున్న అన్నేఫెర్రర్, విశాల ఫెర్రర్

ప్రజాశక్తి-బత్తలపల్లి

దేశంలోనే అత్యంత వెనుకబడిన, కరువు కాటకాలతో నిత్యం అల్లాడిపోతున్న జిల్లాలోని నిరుపేద ప్రజల కోసం మీరు పడిన తపనను కనులారా చూసిన మేము మరువలేకున్నామంటూ పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక ఆర్‌డిటి(రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్ట్) ఫీల్డ్ కార్యాలయంలో మంగళవారం సంస్థ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫ్రెరర్ జయంతి సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, ఆసుపత్రి, ఉమెన్స్ సెక్టార్ డైరెక్టర్ విశాల ఫెర్రర్ ఘాట్ వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళు లర్పించారు. వారు మాట్లాడుతూ ఆర్డీటి అంటే నమ్మకంతో వస్తారని, ఆసుపత్రులకు వచ్చే రోగులతో ప్రేమగా మాట్లాడాలని సిబ్బందికి సూచించారు. ఆర్డీటిలో ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామని, 'స్పందించు-సాయం అందించు' కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషకరమన్నారు. దీని ద్వారా ఎక్కువ మంది చదువుకుంటున్నారన్నారు. ఫాదర్ పెర్రర్ ఆశయమైన పేదరిక నిర్మూలన కోసం నేడు ఆర్టీటి సిబ్బంది, ప్రజలు ముందుకొచ్చారన్నారు. ఇదే ఫాదర్ ఫెర్రర్ మనసుంచి కోరుకున్నదన్నారు. బుధవారం అన్నే ఫెర్రర్ పుట్టినరోజు కావడంతో ఆసుపత్రి సిబ్బంది ముందుగానే జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ ప్రవీన్‌కుమార్, డాక్టర్ పాల్, ఆర్‌డి ప్రమీల, ఎటిఎల్ రుక్మాంగద, ఆసుపత్రి ఇన్‌ఛార్జి హనుమంతరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల లెక్కలు

తేలిగ్గా తీసుకుంటే భారీ మూల్యం.. అభ్యర్థులకు బ్యాంకులో ప్రత్యేక ఖాతా

ఎంపి అభ్యర్థికి రూ. 95 లక్షలు.. ఎమ్మెల్యే అభ్యర్థికి రూ. 40 లక్షలు

ప్రజాశక్తి-హిందూపురం

సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి రూపాయి ఖర్చుకు అభ్యర్థులు లెక్కలు చూపాలి. దీన్ని తేలిగ్గా తీసుకుంటే గెలిచినా, తర్వాత పదవి కోల్పోవాల్సి ఉంటుంది. ప్రతి ఖర్చూ రోజు వారీ పద్దుల పుస్తకంలో నమోదు తప్పనిసరి. అభ్యర్థుల పేరుతో బ్యాంకులో ప్రత్యేక ఖాతా తెరవాల్సి ఉంటుంది. పారదర్శకంగా లెక్కలు చూపేందుకు దేనికి ఎంత ఖర్చు చేయాలన్న ధరలను ఎన్నికల సంఘమే నిర్ణయించింది. దీన్ని ప్రామాణికంగా తీసుకుని సభల నిర్వహణ, పోస్టర్లు, బ్యానర్లు, వాహనాలు, ర్యాలీలు, ఇతరాల ప్రతి ఖర్చుకూ లెక్కలు చూపక తప్పదు. లోక్‌సభ అభ్యర్థులు రూ. 95 లక్షలు, శాసనసభ అభ్యర్థులు రూ. 40 లక్షల వరకూ ఖర్చు చేసేందుకు ఎన్నికల సంఘం అనుమతించింది. దీనికి లోబడే ఖర్చు ఉండాలి. ఉమ్మడి జిల్లాలో అనంతపురం, హిందూపురం పార్లమెంట్ స్థానాలతో పాటు 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో పోటీ చేస్తున్న అభ్యర్థులంతా తప్పక లెక్కలు చూపాల్సిందే. నోటిఫికేషన్ విడుదలైన తేదీ నుంచి ఖర్చులను పరిగణనలోకి తీసుకుంటారు. మద్యం, నగదు, కానుకల పంపిణీని చట్టవిరుద్ధమైన వ్యయంగా పరిగణిస్తారు. ఇందుకోసం ఎలక్షన్ కమిషన్(ఈసి) ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకరు చొప్పున సహాయ వ్యయ పరిశీలకులను, పార్లమెంట్ స్థానానికి సంబంధించి అన్ని విభాగాలను పరిశీలించేందుకు మరో 8 మంది ఎన్నికల వ్యయ పరిశీలకులను ఇప్పటికే నియమించింది.

ఖర్చుల లెక్కలు ఎలా..?

ప్రచారంలో భాగంగా రాజకీయ పక్షాలు ఏర్పాటు చేసే మైకు దగ్గర నుంచి బ్యానర్ల వరకూ, కార్యకర్తలకు ఇచ్చే తేనీరు, నీటి బాటిల్ నుంచి భోజనం వరకూ అన్నింటికీ నమోదు చేయాల్సిన ధరల జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. ఇంతకుమించి ఖర్చు చూపితే అదనపు వ్యయంగా పరిగణిస్తారు. కొన్నింటికి సామర్థ్యం, మరికొన్నింటికి కొలతల వారీగా ఈ ధరలను నిర్ణయించారు. సామర్థ్యం ప్రామాణికంగా రూ. 1,200 నుంచి రూ. 5 లక్షల వరకు సౌండ్ సిస్టం ఏర్పాటు చేసుకోవచ్చు. చదరపు అడుగు ఎల్ఇడి వాల్స్‌కు రూ. 342 వరకు అనుమతిస్తారు. కళ్యాణ మండపానికి రూ. 50 వేల నుంచి రూ. లక్ష, టన్ను ఎసికి రూ. 4 వేలు, ఎయిర్ కూలర్లకు రూ. 15 వేల నుంచి రూ. 50 వేల వరకు వెచ్చించవచ్చు. ఎన్నికల ప్రచారమన్నాక బ్యానర్లు, బ్యాడ్జీలు, జెండాలు, పోస్టర్లు, అనుచరులకు అల్పాహారాలు, భోజనాలు తప్పవు. వీటిలో ప్రతి అంశమూ వ్యయ పరిమితికి లోబడే ఉండాలి. పార్టీ గుర్తు ఉన్న ప్రతి వస్తువుకూ నిర్ణీత ధర ప్రకారమే పద్దు రాయాలి. సాధారణ కుర్చీకి రూ. 5 నుంచి రూ. 20, స్టీల్ కుర్చీకి రూ. 100, మహారాజా సోఫాకు రూ. 1,500, షామియానాలకు రూ. 800 నుంచి రూ. 10 వేలు, మినీ జనరేటర్‌కు రూ. 3,500, 125 కెవి జనరేటర్‌కు రూ. 20 వేలకు మించకూడదు. 200 గ్రాముల పులిహోర, ప్లేట్ ఉప్మా, దోసెకు రూ. 30 వంతున లెక్కించాలి. ప్రచారం, ర్యాలీల్లో ఆయా పార్టీల కార్యకర్తలతో పాటు కూలీలు పాల్గొంటారు. వీరు సభా ప్రాంగణాల ఏర్పాటుకే పరిమితం కారు. వందల సంఖ్యలో జనసమీకరణ జరగాలంటే అందుకు కొంత వ్యయం భరించాల్సిందే. ఈ ఖర్చును వారి కూలిగా చూపాలని ఎన్నికల సంఘం పేర్కొంది. బైక్‌కు 5 లీటర్ల పెట్రోల్‌కు రూ. 550, ఎద్దుల బండికి రూ. 1,500, నైపుణ్యం లేని కార్మికులకు రూ. 519 నుంచి రూ. 649 వరకూ, నైపుణ్యం ఉన్న వారికి రూ. 621 నుంచి రూ. 776 వరకూ, నిపుణులకు రూ. 741 నుంచి రూ. 926, మంచి నైపుణ్యం ఉన్న వారికి రూ. 1,046 నుంచి రూ. 1,059 వరకూ చెల్లించాలని ఈసీ సూచించింది. ప్రస్తుత ధరలు, డిమాండ్‌ను బట్టి ఇంతకంటే అధికంగానే చెల్లించినా ఈ మేరకు మాత్రమే వారు ఈసీకి సమర్పించే వ్యయ నివేదికల్లో పొందుపరచాల్సి ఉంటుంది. లెక్క తప్పితే గెలిచిన తర్వాతైనా ఇబ్బందులు తప్పవు.

ఎమ్మెల్యే జలచౌర్యంపై

ఈసీకి ఫిర్యాదు చేశాం

మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి వైసిపి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రజల దాహార్తి తీర్చే నీటిని దొంగ చాటుగా తన సొంత తోటకు మళ్లించారని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సత్యసాయి బాబా ఎంతో మంచి ఉద్దేశంతో ప్రజల దాహార్తి తీర్చడానికి ఈ పథకాన్ని ప్రారంభించగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ట్రస్టు చేపట్టిన తాగునీటి సరఫరా వ్యవస్థకే మాయని మచ్చ తెచ్చేలా అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమంగా పైపులు ఏర్పాటు చేసుకుని సొంత వ్యవసాయ తోటకు నీరును వినియోగిస్తున్నారన్నారు. నాలుగేళ్లుగా ప్రజలకు తాగునీరు రాకుండా చేసి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేలా చేశారన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి సహకరించిన ఉద్యోగులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పల్లె డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఏ గ్రామంలో చూసినా తాగునీటి సమస్య అధికంగా ఉందని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ప్రజల సమస్యలు పట్టించుకోకుండా గాలికి వదిలేసి సొంత ప్రయోజనాలపై ఎక్కువగా దృష్టి పెట్టారన్నారు. నాలుగేళ్లుగా నీటి దోపిడీకి పాల్పడిన ఎమ్మెల్యేపై వాల్టా చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నీటి దోపిడీపై జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఉన్నతాధికారులు తక్షణం స్పందించి ప్రత్యేక విచారణ చేపట్టాలని కోరారు. 193 చెరువులకు నీళ్ల ఇస్తానని చెప్పిన ఎమ్మెల్యే ప్రజల దాహార్తి తీర్చే నీటిని నాలుగేళ్లుగా సొంత తోటకు దొంగలించడం దుర్మార్గమన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తోటకు తాగునీటి తరలింపు దుర్మార్గం

కాంగ్రెస్ అభ్యర్థి దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజలకు తాగునీరు అందించాల్సిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తన పంట కోసం నీటిని దొంగలించడం దుర్మార్గమని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగేళ్లుగా నల్లమాడ మండలం నల్లసింగయ్యగారిపల్లిలో తన తోటకూ సత్యసాయి తాగునీటిని పైపుల ద్వారా తన తోటకు వదులుకుంటున్నారని మండిపడ్డారు. ఓ వైపు ప్రజల గొంతెండుతుంటే వారికి నీరందించాల్సిన ప్రజాప్రతినిధి ఇలా జల చౌర్యానికి పాల్పడడం సిగ్గుచేటు అన్నారు. సత్యసాయి ప్రజల దాహార్తి తీర్చడానికి ఏర్పాటుచేసిన తాగునీటి పథకం ద్వారా నీటి సరఫరా చేస్తుంటే ఆ నీటిని తన తోటల కోసం వాడుకోవడం క్షమించరాని నేరమన్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడానికి జంకుతున్నారన్నారు. మీడియా ద్వారా నీటి దొంగ బయటపడడంతో మంగళవారం అధికారులు ఆ గ్రామానికి వెళ్లగా వారిని ఫోన్‌లో ఎమ్మెల్యే బెదిరించడం అన్యాయం అన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే ఆ ప్రాంత ప్రజలు ఓటుతోనే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఫాదర్ ఫెర్రర్ ఆశయ సాధనకు పాటుపడదాం

ప్రజాశక్తి-బత్తలపల్లి

తోటి మనుషులకు సాయపడడం, మంచి పని చేయడమే ఆర్‌డిటి వ్యవస్థాపకులు, దివంగత ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌కు మనం ఇచ్చే నిజమైన నివాళి అని రీజనల్ డైరెక్టర్ ప్రమీల, ఎటిఎల్ రుక్మాంగధ పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఫాదర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కోడేకండ్ల, ఈదుల ముష్టూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫెర్రర్ జయంతి సభలకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడా రు. బత్తలపల్లి మండలంలో వేడుకలను ప్రజలు స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నారన్నారు. 3,100 హుండీలను ప్రజలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. గతేడాది హుండీల ద్వారా రూ. 14 లక్షలు వచ్చినట్లు తెలిపారు. వాటిని పేద ప్రజలు, అనాథల కోసం ఖర్చు చేశారని వివరించారు. ఈ ఏడాది 1,099 హుండీల ద్వారా రూ. 6లక్షలు వచ్చినట్లు తెలిపారు. జిల్లాలో సంస్థ అనేక సేవా కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. వ్యాపార వేత్తలు, ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగులు, నాయకు లు స్పందించి విరాళాలు ఇవ్వడం సంతోషమన్నారు. ఇందులో మరింత మంది భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం ఆయా గ్రామాల్లో హుండీలను పంపిణీ చేశారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో ప్రజలు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, మాంఛో ఫెర్రర్ చిత్రాలను ఊరేగించారు. సంజీవపురం వద్ద ఫాదర్ విగ్రహం ముందు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆర్‌డిటి సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని గుడ్డంపల్లి తండాలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. జిల్లాకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆర్‌డిటి సంస్థ వ్యవస్థాపకుడిగా ఆయన ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, దళితుల గుండెల్లో నిలిచిన దేవుడు అన్నారు.

ఫాదర్ ఫెర్రర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజలు

వైసిపికి మరో అవకాశమివ్వండి

కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్

ప్రజాశక్తి-కదిరి టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమం పథకాలను చూసి మరో మారు వైసిపికి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ ప్రజలను కోరారు. ఆయన మంగళవారం కదిరి రూరల్ మండలంలోని మరువతండా, మిద్దివారిపల్లి, మూలపల్లితండా, గంగనగారిపల్లి గ్రామాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మక్బూల్ ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటేనే ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. కావున ప్రతిపక్షాలు చెప్పే అబద్ధపు హామీలు, మాయమాటలు నమ్మవద్దని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, రాష్ట్ర సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల వెంకటరమణ, లీగల్ సెల్ జోనల్ ఇన్‌ఛార్జి లింగాల లోకేశ్వర్‌రెడ్డి, ఎంపిపి అమర్నాథ్‌రెడ్డి, జెడ్పిటిసి భూక్యా రాధాకృష్ణనాయక్, రూరల్ మండల కన్వీనర్ ప్రకాష్, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి మణికంఠ నాయక్, రూరల్ మండల వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో మక్బూల్

కదిరి రూరల్ మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ హమాలీ క్వార్టర్స్‌లోని నూరుల్ హయత్ మజీద్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్.మక్బూల్ పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షల విరమణ అనంతరం మసీదులో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్‌చాంద్‌బాషా, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్, అత్తార్ చాంద్‌బాషా

'అన్వర్‌బాషా పార్టీ మారలేదు'

కదిరి అర్బన్ : గాండ్లపెంట మండలంలోని కటారుపల్లికి చెందిన అన్వర్‌బాషా పార్టీ మారినట్లు వచ్చిన కథనాలు పూర్తిగా అసత్యమని వైసిపి మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్ మక్బూల్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. సోమవారం కిరాణా కొట్టులో సరుకులు కొంటున్న అన్వర్‌బాషాకు ఇష్టం లేకున్నా టిడిపి నాయకులు కండువా వేసి పార్టీలో చేరాడని ప్రకటించారన్నారు. ఇదంతా టిడిపి నాయకులు ఆడిన నాటకమని తెలిపారు. ఎవరైనా పార్టీలో చేరాలంటే ఆ పార్టీ విధానాలతో పాటు ఆశయాలు నచ్చి చేరతారని, ఇలా బలవంతంగా కండువా వేసి పార్టీలో చేరాడని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర ప్రజలకు సిఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు చేస్తున్న అభివృద్ధిని వదిలి బూటకపు హామీలు ఇచ్చే చంద్రబాబు పార్టీలో ఎవరూ చేరరని కదిరి టిడిపి నాయకులు ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు. వారితో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో హాజరుకాండి : డిఇఒ

పుట్టపర్తి : ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కోరే ఉద్యోగులు పదో తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో హాజరుకావాలని డిఇఒ మీనాక్షి తెలిపారు. అయితే డాక్టర్ చేత మినహాయింపు సర్టిఫికెట్ పొందాలన్నారు. గర్భిణులు, వంద శాతం వికలాంగులు, పదవీ విరమణ పొందే వారు మాత్రమే ఇందుకు అర్హులు అన్నారు.

నేడు ఉపాధ్యాయులకు ఎన్నికల శిక్షణ

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు ఈ నెల 10వ తేదీ ఆయా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సమక్షంలో నిర్వహించే ఎన్నికల శిక్షణ తరగతులకు ఉపాధ్యాయులు హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి(డిఇఒ) మీనాక్షి తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకూ పదో తరగతి మూల్యాంకనం జరుగుతున్న దృష్ట్యా వారికి ఈ నెల 10వ తేదీ ఎన్నికల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. పదో తరగతి మూల్యాంకనంకు హాజరైన ప్రతి ఒక్కరూ అలాగే వాల్యు యేషన్ ఆర్డర్ వచ్చి మినహాయింపు, ఎన్నికల ఆర్డర్ పొందని వారు కూడా ఎన్నికల శిక్షణ శిబిరానికి తప్పకుండా హాజరు కావాలని డిఇఒ తెలిపారు. గైర్హాజరైన వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి బ్రహ్మరథోత్సవం

లేపాక్షి : మండలంలోని చోళసముద్రం గ్రామంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయలు కాలం నాటి పురాతన ఆలయంలో వెలసిన చౌడేశ్వరి దేవి బ్రహ్మరథోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులకు పానకం, మజ్జిగ, పెసర బేడలు అందించారు. ముఖ్య అతిథిగా వైసిపి జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్ హాజరయ్యారు. రథోత్సవంలో ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందస్వామి, వైసిపి మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ బాణాల శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తజనం మధ్య చౌడేశ్వరిదేవి బ్రహ్మ రథోత్సవం

ఉగాది సంబరాల్లో భాగంగా శిల్పారామంలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ఉగాది పర్వదినం సందర్భంగా స్థానిక శిల్పారామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరింపజేశాయి. బాల బాలికలు శిల్పారామంలో మంగళవారం సాయంత్రం భరత నాట్యం, కూచిపూడి ఆధునిక నృత్యాలు ప్రదర్శించారు. మదనపల్లికి చెందిన నందిని నాట్య విద్యార్థి, పుట్టపర్తి ప్రసాద్ కూచిపూడి నోకియాచారి ఆధ్వర్యంలో చేసిన ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు నాట్యాలు, కూచిపూడి, భరతనాట్యం ఎంతో నైపుణ్యంతో ప్రదర్శించారు. అనంతరం వానవోడు నాగరాజు శర్మ ఆధ్వర్యంలో ఉగాది పంచాంగం వినిపించారు. ఆ తర్వాత మదనపల్లి సూర్య డాన్స్ మాస్టర్, నందిని, పుట్టపర్తి కూచిపూడి ప్రసాద్‌లను ఎఒ రమేష్‌రెడ్డి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రాచీన కళలను పరిరక్షించుకోవడం ఎంతో అవసరం అన్నారు. ప్రతి ఉగాదికి కళాకారులచే ప్రదర్శనలు ఇప్పిస్తున్నామన్నారు. పుట్టపర్తి ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు.

ఘనంగా ఉగాది వేడుకలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలో ఉగాది పర్వదినాన్ని మంగళవారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. తమ ఇళ్లకు మామిడి తోరణాలు కట్టి, పచ్చడి చేసుకొని కుటుంబ సభ్యులు ప్రసాదంగా తీసుకున్నారు. ఆయా గ్రామాల్లో ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. బత్తలపల్లిలోని శ్రీలలిత త్రిపుర సుందరీ సమేత శ్రీఓంకారేశ్వరస్వామి ఆలయంలో ఓంకారేశ్వరునికి, కొల్లాపురమ్మ, బళ్లారి దుర్గమ్మ, అంకాలమ్మ, గంగమ్మ ఆలయాల్లో, పోట్లమర్రిలోని మల్లేశ్వరాలయం, ఆంజనేయస్వామి, నల్లలమ్మ ఆలయాలు, ముష్టూరులోని ఆంజనేయ స్వామి, శివాలయాలు, గంటాపురం అప్పస్వామి, మాల్యవంతం, రామాపురం వీరనారాయణ స్వామి ఆలయల్లో, డి.చెర్లోపల్లిలోని సిద్దేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం, సంగమేశ్వర క్షేత్రం, కాటికోటేశ్వరస్వామి క్షేత్రాలతో పాటు వివిధ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రజలు కొత్త దుస్తులు ధరించి, స్వీట్లు భుజించి పండుగను వైభవంగా జరుపుకున్నారు. ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాల్లో జోరుగా పందేలు నిర్వ హించారు. గ్రామాల్లో నారికేళాలు, చీనీ పండ్లను విసురుతూ పందేలు చేపట్టారు. మరికొందరు సరి బేసి, తదితర ఆటలు ఆడుతూ పందేలు కాశారు. పండుగ కావడంతో పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారు.

ఆపస్ ఆధ్వర్యంలో 'ఉగాది ఉత్సవం'

పుట్టపర్తి : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు అమరా చంద్రబాబు అధ్యక్షతన కొత్తచెరువులో మంగళవారం ఉగాది ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఉప విద్యాశాఖాధికారి మునెయ్య, సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షులు సుధాకర్ హాజరై ఉగాది విశిష్టత గురించి తెలిపారు. వారు కవులు మాణిక్యం ఇసాక్, కొండసాని రజితలకు ఉగాది పురస్కారాలు అందజేశారు. తరువాత ఉగాది పచ్చడి వితరణ చేశారు. కార్యక్రమంలో ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు, ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, ఉపాధ్యాయులు జనార్దన్, సుధాకర్, బాబు, చంద్రశేఖర్, మాధవీలత పాల్గొన్నారు. కొత్తచెరువు మండల వ్యాప్తంగా ఉగాది పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. వివిధ ఆలయాల్లో తెల్లవారుజామునే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎద్దులతో రాతిదూలం లాగే పోటీలు నిర్వహించారు.

తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు

టిడిపి రాష్ట్ర మైనార్టీ నాయకులు మహమ్మద్ రఫీ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ముస్లిములకు 4 శాతం రిజర్వేషన్లు తొలగిస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి చెప్పినట్లు వస్తున్న వార్తలను నమ్మవద్దని టిడిపి రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి మహమ్మద్ రఫీ సూచించారు. పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో కొందరు పురందేశ్వరి చెప్పినట్లుగా ఆ వార్తను వైరల్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో బిజెపి, టిడిపి, జనసేనపార్టీల కూటమిని దెబ్బతీసేందుకు ఇలాంటి తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారని ముస్లిం మైనార్టీలు నమ్మవద్దని కోరారు. రాష్ట్ర అభివృద్ధి, అరాచక పాలనను అంతమొందించేందుకే చంద్రబాబు కూటమి ఏర్పాటు చేశారన్నారు. గతంలో కూడా కూటమి ఏర్పడిన సంగతిని ఆయన గుర్తు చేశారు. టిడిపి హయాంలోనే ముస్లింల అభివృద్ధి జరిగిందన్నారు. గతంలో చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఇప్పుడు కూడా 40 శాతం రిజర్వేషన్, సంక్షేమ పథకాల అమలుకు టిడిపి కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మవద్దని కోరారు.

టిడిపి నాయకుల ప్రచారం

ఓబుళదేవరచెరువు : ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కొండకమర్లకు చెందిన టిడిపి నాయకులు కోరారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం వారు మండలంలోని కొండకమర్ల గ్రామపంచాయ తీలో ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి పల్లె సింధూరారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో డాక్టర్ జాకీర్‌అహ్మద్, పొగాకు షఫీ, అహ్మద్, బాలకృష్ణారెడ్డి, డిఎస్ బషీర్, బుక్కపట్నం బాషా, సలాం, బాబుఖాన్, బూత్ కన్వీనర్లు పొగాకు షానవాజ్, గండికోట ఇర్షాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

పంచాంగ శ్రవణంలో పాల్గొన్న రఘువీరా దంపతులు

పంచాంగ శ్రవణంలో రఘువీరా దంపతులు

మడకశిర : తెలుగు వారి నూతన సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసి ఉగాది పంచాంగ శ్రవణం కార్యక్రమంలో సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి దంపతులు పాల్గొన్నారు. శ్రీక్రోధి ఉగాది సంవత్సరంలో ప్రజలం దరూ సుఖ శాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని జక్కలచెరువు గ్రామ సమీపంలో 67వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గుంతకల్లు పట్టణంలోని సత్యనారాయణ పేటకు చెందిన ఆర్.నాగయ్య అనే వ్యక్తి లారీ క్లీనర్‌గా పని చేసేవాడు. ఈ నేపథ్యంలో రాయల చెరువు నుంచి గుంతకల్లుకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా జక్కలచెరువు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మహారాజశ్రీ ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు, కదిరి
I.A.No.537/2022 in O.S.No.395/2022
Between:
K.Obireddy ...Plaintiff
V/S
1.Sugali Sudharani
2.Sugali Umesh Naik
3.Sugali Jayasree
4.Sugali Muthyalamma ...Defendants
To
Defendant No:4 : సుగాలి ముత్యాలమ్మ ,W/o లేట్ సుగాలి పీరూ నాయక్, వయస్సు 72 సంవత్సరాలు, హిందూ, గసిరెడ్డిపల్లి తాండా, (V) H/o ఎగువగంగంపల్లి తాండా, గోరంట్ల మండలం, శ్రీ సత్యసాయిజిల్లా.
4వ ప్రతివాదికి కోర్టు నోటీసులు
పై తెలిపిన వాది మీ పై ప్రామిసరీ నోటు బాకీ పనులు కోసం దావా వేసి ఉన్నారు. ఈ దావాలో నిన్ను నాల్గోవ ప్రతివాదిగా చేర్చడమైనది. నీ హాజరు నిమిత్తం పై కోర్టులో 29/04/2024వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. ఆ రోజు నీవు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా కానీ కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు వారికి తెలుపుకోవాలని ఇందుములంగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:29/04/2024
స్థలం:కదిరి
కె.నాగేంద్ర రెడ్డి,B.A., B.L,
వాదితరుపున న్యాయవాది కదిరి.

In The Court of The Hon'ble 1st Addl Junior Civil Judge, Kadiri.
O.S. No: 442/2023
Between:
V.Ramalinga Reddy ...Plaintiff
VS
G.Neelama and others ...Defendents
To
Defendant No.2: శోభా D/o లేట్ రామిరెడ్డి, వయస్సు 35 సంవత్సరాలు, మల్లెలవాండ్ల, డబురువాండ్ల పల్లి పోస్టు, ఓడి చెరువు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
Defendant No.3: ఎం.మమత D/o లేట్ రామిరెడ్డి, వయస్సు 26 సంవత్సరాలు, మల్లెలవాండ్ల, డబురువాండ్ల పల్లి పోస్టు, ఓడి చెరువు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
2 మరియు 3వ ప్రతివాదికి కోర్టు నోటీసులు
పై తెలిపిన వాది మీపై మార్టిగేజి బాకీ పనులు కోసం కోర్టులో దావా వేసియున్నారు. ఈ దావాలో మిమ్ములను 2 మరియు 3వ ప్రతివాదులుగా చేర్చడమైనది. మీ హాజరు నిమిత్తం పై కోర్టులో 08/05/2024వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేదా మీ వకీలు ద్వారా కానీ కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు వారికి తెలుపుకోవాలని ఇందుములంగా మీకు తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:08/05/2024
స్థలం:కదిరి
కె.నాగేంద్ర రెడ్డి,B.A., B.L,
పిటీషనర్ తరపు న్యాయవాది కదిరి.

వమహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు, కదిరి
I.P.No: 3/2023
Between:
చిట్టిమిరెడ్డి మధుసూదన్ రెడ్డి ...Petitioner
And
బి.అక్కులు నాయక్ మరియు ఇతరులు ...Respondents
R35: G.శేఖర్ S/o G.వెంకటరమణ Residing at అమడగూరు గ్రామము మరియు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
R94: I.వెంకటస్వామి రెడ్డి S/o I.మోపూరి రెడ్డి Residing at బాలప్పగారిపల్లె, తుమ్మల పోస్టు, అమడగూరు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
R98: G.గంగులప్ప S/o G.గంగప్ప Residing at కొట్టువారిపల్లె, తుమ్మల పోస్టు, అమడగూరు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
పై పిటీషన్‌లోని 35వ 94వ మరియు 98 వ ప్రతివాదులకు నోటీసులు
పై INCOLVENCY PETITION ను చిట్టిమిరెడ్డి మధుసూదన్ రెడ్డి, పై కోర్టులో బి.అక్కులు నాయక్ మరియు ఇతరులు పై దాఖలు చేసి ఉన్నారు. పై INCOLVENCY PETITION లో 35వ 94వ మరియు 98వ ప్రతివాదులు అయినా మీ హాజరు నిమిత్తం ఘనమైన కోర్టు వారు 07/05/2024వ తేదికి వాయిదా వేసియున్నారు.కావున మీరు 07/05/2024వ తేదిన ఉదయం 10:30 గం॥లకు మీరు స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపనులు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టు వారు పై పిటీషన్‌ని మీ పరోక్షముగా తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:07/05/2024
స్థలం:కదిరి
G.గురులింగస్వామి,B.A., B.L,
పిటీషనర్ తరపు వకీలు, కదిరి.

చలివేంద్రం ఏర్పాటు

పుట్టపర్తి : బుక్కపట్నం మండలంలోని బుచ్చయ్యగారిపల్లి గ్రామంలో మాజీ ఎంపిటిసి జయరామ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మంగళవారం టిడిపి నాయకులు ప్రారంభించారు. నిత్యం ప్రజలు సంచరించే చోట చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జయరామ్, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు వెంకటనారాయణరెడ్డి, వంశీకృష్ణ, విజయ్, చంద్ర, సతీష్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్ కుటుంబానికి తక్షణ సాయం అందజేత

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని ఎర్రగుంట పంచాయతీ సచివాలయంలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజేశ్వరి కొన్ని రోజులుగా కామెర్లు(జాండీస్)తో బాధపడుతూ ఉండేది. ఈ క్రమంలో ఆమె కర్నాటకలోని పావగడలో ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందేది. మూడు రోజుల క్రితం ఇంటికి రాగా సోమవారం సాయంత్రం పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం తరపున తక్షణ సాయంగా రూ. 25వేలను ఎర్రగుంట సెక్రటరీ అరుణ మంగళవారం వారి ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు.

రాజేశ్వరి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న సెక్రటరీ అరుణ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సొంత వాహనంలో ఆసుపత్రికి తరలించిన సవితమ్మ

రొద్దం : పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో చెక్‌పోస్ట్ సమీపంలోని మసీదు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కుర్లపల్లి గ్రామానికి చెందిన దినేష్, అతని బంధువు నరసింహులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. కర్నాటకలోని కొడమడుగు గ్రామం నుంచి వారు ద్విచక్ర వాహనంపై కుర్లపల్లికి వెళ్తుండగా మండలంలోని ఆర్.మరువపల్లి, రొద్దం గ్రామాల మధ్య ఉన్న మసీదు వద్ద అదుపుతప్పి కింద పడ్డారు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న వారిని ఆ సమయంలో పెనుకొండ వైపు నుంచి మండలంలోని పెద్దగువ్వలపల్లి గ్రామానికి వెళ్తున్న పెనుకొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ గమనించి తన వాహనంలో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స కోసం వారిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

గాయపడిన వ్యక్తికి సాయం చేస్తున్న సవితమ్మ

టిడిపి కార్యకర్త కుటుంబానికి సవితమ్మ పరామర్శ

మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త బండ్లపల్లి అంజనప్ప కుమారుడు సుబ్బరాయుడు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న పెనుకొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ ఆ గ్రామం వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అతడి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి, మాధవనాయుడు, వీరాంజి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలమత్తూరు : మండల పరిధిలోని సోమగట్ట పంచాయతీలోని చెరువుకిందపల్లి గ్రామ సమీపంలో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి గోతిలో పడ్డ ఘటనలో శ్రీనివాసులు(40) మృతి చెందినట్లు ఎస్ఐ గంగాదర్ తెలిపారు. మృతుడు కర్నాటకలోని బాగేపల్లి తాలూకా బద్రప్పపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా ఎస్ఐ తెలిపారు. అతడి భార్య గీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బియ్యం గోదాములో అగ్నిప్రమాదం

పుట్టపర్తి : బుక్కపట్నంలోని పౌర సరఫరాల గోదాములో మంగళవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరగడంతో బియ్యం బస్తాలు అగ్నికి ఆహుతయ్యాయి. గోదాములో 4 వేల బస్తాలు నిల్వ ఉండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల వారు వెంటనే స్పందించడంతో భారీ నష్టం తప్పింది. కొంతమేర నష్టం వాటిల్లింది. సమాచారం అందిన వెంటనే ఫైర్ సిబ్బంది ప్రమాద స్థలం చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఎండలు మండుతున్నాయి..

చిన్న పిల్లలు జాగ్రత్త..!



ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు ఆఫ్తాబ్

ప్రజాశక్తి-హిందూపురం

చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అందులోనూ వేసవి కాలం అంటే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రి చిన్న పిల్లల వైద్యులు ఆఫ్తాబ్ సూచిస్తున్నారు. వేసవిలో చిన్న పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు ఆఫ్తాబ్ ప్రజాశక్తికి వెల్లడించిన వివరాలు..

తల్లిపాలు శ్రేయస్కరం

చంటి బిడ్డలకు తరచూ తల్లిపాలు తాగించాలి. 6 నెలల వయస్సు వరకూ దప్పికకు నీరు తాగించడం కంటే తల్లిపాలు తాగించడం ఉత్తమం. ఇందుకోసం తల్లి మామూలుగా తీసుకొనే నీటికంటే ఎక్కువగా నీరు తాగాలి.

పల్లెల్లో జాగ్రత్తలు

గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. కాబట్టి ఫ్యాన్ వేసుకోవడం సాధ్యపడనప్పుడు కిటికీలు, తలుపులకు కర్టన్, తెరలు వేసుకోవడం ఉత్తమం. చల్లటి గాలిని ఇచ్చే కానుగ చెట్లకింద ఉండటం మంచిది. వేడి గాలులను ఇచ్చే చింత చెట్ల కింద బిడ్డలను ఉంచవద్దు.

6 నెలల కంటే పెద్ద పిల్లల విషయంలో..

ద్రవ పదార్థాలు తరుచూ తాగించాలి. జ్యూస్, కొబ్బరి నీళ్లు, సాధారణ నీరు తాగించాలి. పుచ్చకాయ(కళింగర), దోసపండ్లు, నీరు ఎక్కువగా ఉండే ఫలాలు ఇవ్వాలి.

సూర్యరశ్మి నుంచి రక్షణ

ఉదయం 8, 9 గంటల తర్వాత కిటికీలు మూసివేయలి. దీని వల్ల వేడి ఇంట్లోకి రాదు. నేరగా సూర్యరశ్మి ఇంట్లోకి రాకుండా చూసుకోవాలి. సాయంత్రం 5 గంటల పైన కిటికీలు తెరుచుకోవచ్చు.

వైద్యులు ఆఫ్తాబ్

దుస్తుల విషయంలో..

పురిటి బిడ్డలకు పలుచటి దుస్తులు వేయాలి. కొందరు బిడ్డలకు పూర్తిగా దుస్తులు వేయకుండా ఉండటం మంచిది అనుకుంటారు. అయితే అది మంచి పద్ధతి కాదు. దుస్తులు లేకపోవడం వల్ల చంటిబిడ్డ శరీరంలోని నీరు ఆవిరయ్యే ప్రమాదం ఉంది. పెద్దలు లైట్ కలర్ దుస్తులు వేసుకోవడం ఉత్తమం. వేసవిలో తెల్లటి దుస్తులు వాడటం మరీ మంచిది. నల్లగొడుకు కాకుండా కలర్ గొడుగులు వాడడడం మంచిది.

చలువ అద్దాలు వేసుకోవాలి

ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసేవారు టోపీ పెట్టకోవడం అవసరం. చలువ అద్దాలు ధరించడం మంచిది.

పాఠశాల నుంచి వచ్చేటప్పుడు

వేసవిలో ప్రభుత్వం ఒంటి పూట బడులు నిర్వహిస్తోంది. ఇప్పుడున్న వేడికి ఇది సరికాదు. మిట్ట మధ్యాహ్నం వేడిలో చిన్నారులు ఎండలో నడిచి ఇంటికి రావడం వల్ల ఇబ్బందులు పడుతుంటారు. వారిని ఇంటికి చెట్ల నీడలో రమ్మని చెప్పడం తల్లిదండ్రులు మరువకూడదు.

ఎండలో ఆడుకోవడంపై..

వాతావరణంలో వచ్చే మార్పుల ప్రభావం పిల్లలపై ఎంత తీవ్రంగా ఉంటుందో తెలియదు. ఎండ తీవ్రత వల్ల కలిగే ప్రమాదాన్ని వారికి ఓపిగ్గా వివరించాలి. వేసవి సెలవులకు ముందే ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థికి వడదెబ్బపై అవగాహన కల్పించాలి. ఉదయం 9 గంటల తర్వాత, సాయంత్రం 6 గంటల లోపు విద్యార్థులు ఎండలో ఆడుకోవడం తగదు. ఇండోర్ గేమ్స్ ఆడుకోవడం ఉత్తమం.

వడదెబ్బకు గురైతే..

వేసవిలో ఓఆర్ఎస్ అమృతం అని చెప్పాలి. ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా ఇచ్చే ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను ఒక లీటర్ నీటిలో కలుపుకోవాలి. బయట దొరికే ఓఆర్ఎస్ అయితే 200 మిల్లీలీటర్లతో కలపుకోవాలి. ఓఆర్ఎస్ ద్రవాన్ని అప్పుడప్పుడు బిడ్డలు, పెద్దలు తాగవచ్చు. దీని వల్ల శరీరంలో నుంచి పోయిన లవణాలు తిరిగి చేరుతాయి. కాళ్లు పీకుతున్నట్లు అనిపించినా, కండరాల నొప్పిగా అనిపించినా ఓఆర్ఎస్ తాగడం అవసరం. వడదెబ్బకు గురైతే చెమట పట్టదు, వాంతులు, జ్వరం వస్తాయి. వాంతులు వస్తున్నప్పుడు ఓఆర్ఎస్‌ను కాఫీ లాగా కొంత తాగించాలి. లేదంటే అది కూడా వాంతి అయ్యే అవకాశం వుంది.